

# ఎడతెరిపిలేని వర్షాలతో మత్తడి దూకుతున్న చెరువులు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. చెరువులు, కుంటల వద్ద చేపల వేటకు వెళ్లొద్దు
- శిథిలావస్థ భవనాలకు దూరంగా ఉండాలి.. వ్యవసాయ బావుల వద్ద జాగ్రత్త
- చెరువులను పరిశీలించిన ఆర్డీవో వేణు మాధవరావు, తహసీల్దార్ దయానందం

2

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం


నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 పేజీలు:17



# తెలంగాణను మళ్ళీ చీకట్లోకి నెడుతున్న రేవంత్ సర్కార్..!



- ప్రభుత్వ చేతగానితనంతో రాష్ట్రం లో విద్యుత్ కష్టాలు- సింగరేణిలో నాణ్యమైన బొగ్గును పక్క రాష్ట్రాలకు అమ్ముకుంటూ సాకులు చెబుతున్న ప్రభుత్వం
- స్థానికులకు ఉద్యోగాల కల్పన కోసం కొట్లాడుతాం
- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి - భారీగా బిఆర్ఎస్ శ్రేణులతో వైటీపీఎస్ సందర్శన, ఆందోళన

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 24,(ప్రజాజ్యోతి):** రేవంత్ రెడ్డి సర్కార్ చేతగానితనంతో తెలంగాణను మళ్ళీ చీకట్లోకి నెడుతుందన్నారు మాజీ విద్యుత్ శాఖ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి. గురువారం దామరచర్ల మండలంలోని వీర్లపాలెం వద్ద నెలకొని ఉన్న యాదాద్రి ధర్మల్ పవర్ ప్రాజెక్టుకు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులతో సహా భారీగా బి ఆర్ ఎస్ శ్రేణులతో కలిసి చేరుకొని ఆందోళన చేపట్టారు.

మిగతా 2 లో

# ఎ టి ఎం ల్లా కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం..

## - మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు లకు వైటిపిఎస్ లు...!



- ముందు చూపులేని గత బిఆర్ఎస్ పాలకుల వల్ల ప్రభుత్వం పై వేల కోట్ల అదనపు భారం
- నిర్వాసితులను పక్కనపెట్టి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించుకున్న చరిత్ర బిఆర్ఎస్ వారిదే - బినామీ కాంట్రాక్ట్ లు, కమిషన్లతో కోట్ల రూపాయల దండుకున్న అవినీతి వారిదే - త్వరలోనే గత పాలకుల అవినీతిని ప్రజల ముందు పెడతాం - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 24, (ప్రజాజ్యోతి):** ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి వేలకోట్ల రూపాయలు వెనకేసుకునేందుకు కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం, మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావులకు ఏటీఎం ల్లా పనిచేశాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్ ) తీవ్ర ఆరోపణలు చేశారు.గురువారం కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు శ్రేణులతో పెద్ద ఎత్తున దామరచర్ల మండలంలోని యాదాద్రి ధర్మల్ పవర్ ప్రాజెక్టు వద్దకు చేరుకొని సమావేశం ఏర్పాటు చేశారు.

మిగతా 2 లో

# ఎడతెరిపిలేని వర్షాలతో మత్తడి దూకుతున్న చెరువులు

మొదటిపేజీ తరువాయి

**తుంగతుర్తి, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):**



తుంగతుర్తి మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. వర్షాల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మండల కేంద్రంలోని వెలుగుపల్లి రోడ్డులో ఉన్న పెద్ద చెరువు అలుగు పోస్తుండడంతో ఆర్డీవో వేణు మాధవరావు, తహసీల్దార్ దయానందం గురువారం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో నీటిమట్టం, అలుగు పరిస్థితిని పరిశీలించిన అధికారులు సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెరువులు, కుంటలు, వాగులు, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో సూచించారు. ముఖ్యంగా చేపల వేట కోసం చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని హెచ్చరించారు. వ్యవసాయ బావుల వద్ద రైతులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాలతో బావుల చుట్టుపక్కల ప్రాంతాలు జారుడుగా మారే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఎవరూ నివాసం ఉండకూడదని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. మండలంలో వర్షాల పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీవో ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

# ఎ టి ఎం ల్లా కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం.. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు లకు వైటిపిఎస్ లు...!

మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ముందు చూపు లేకుండా బొగ్గు సరఫరాకు అనుకూలం లేని సుదూర ప్రాంతంలో కోట్ల రూపాయలు దండుకునేందుకు యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మించింది అన్నారు. దీనివలన బొగ్గు సరఫరా కోసం ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయల అదనపు భారం పడుతుందన్నారు. దొంగే దొంగ దొంగ అన్న చందంగా యాదాద్రి నిర్మాణంలో బినామీ కాంట్రాక్టులు, కమిషన్లతో వేలకోట్ల రూపాయలు దండుకున్న గత పాలకులు ప్రజలను మభ్య పెట్టేందుకు రకరకాల డ్రామాలు ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి కమిషన్ల కక్కుర్తి కోసం బిఆర్ఎస్ లోకి జంప్ అయిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు అభివృద్ధి పేరుతో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. భూ నిర్వాసితుల ప్రయోజనాలను పక్కనపెట్టి బినామీ పేర్లతో టిఆర్ఎస్ నాయకులకు కోట్లు కట్టబెట్టిన చరిత్ర గత పాలకులదే అన్నారు. బిఆర్ఎస్ నాయకులకే ఉద్యోగాలు ఇప్పించుకొని, నిర్వాసితులకు మొండి చేయి చూపించిన వారు ఏ ముఖం పెట్టుకొని పవర్ ప్లాంట్ వద్దకు వచ్చారని నిలదీశారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని వేగవంతం చేసి ఉత్పత్తి ప్రారంభించామని, నిర్వాసితులకు ప్రయోజనాలు చేకూర్చడంతో పాటు సుమారు 450 మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ కాంగ్రెస్ ప్రభుత్వం దేనన్నారు. ఐదు యూనిట్లను త్వరగా పూర్తిచేసి విద్యుత్ ఉత్పత్తి సాధిస్తామని తెలిపారు. అర్హులైన స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు తన వంతు పూర్తి కృషి చేస్తానని అన్నారు. గతంలో జరిగిన అవినీతి వ్యవహారాన్ని మచ్చుకు కొన్ని చదివి వినిపించారు. గతంలో జరిగిన అవినీతి చిట్టా అంత తమ వద్దకు వస్తుందని, త్వరలోనే గత పాలకుల అవినీతి భాగవతాన్ని ప్రజల ముందు పెడతామన్నారు. తాను ఎవరికి భయపడేది లేదని, నియోజకవర్గ ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసమే నిరంతరం కృషి చేస్తానని వెల్లడించారు. రాజకీయ లబ్ధి కోసం ఇకనైనా బిఆర్ఎస్ నాయకులు డ్రామాలు మానుకోవాలని హితవు పలికారు. తమ అనుభవంతో అభివృద్ధి కోసం ఇచ్చే సలహాలు సూచనలు పాటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ధీరావత్ స్కైలాబ్ నాయక్, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, గుడిపాటి నవీన్, దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగు నాయక్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు బెజ్జం సాయి, మాజీ సర్పంచులు బంటు కిరణ్, చల్లా అంజిరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్లు పోకల వెంకటేశ్వర్లు, బంటు రేణుక సిరి, సైదా నాయక్,మంగ్తా నాయక్, శంకర్ నాయక్, ప్రజా ప్రతినిధులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణను మళ్ళీ చీకట్లోకి నెడుతున్న రేవంత్ సర్కార్..!

మొదటిపేజీ తరువాయి





ముందస్తు సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ ఎత్తున పోలీసులు మోహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్లాంట్ లోనికి వెళ్లేందుకు బిఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం అధికారుల సూచన మేరకు మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఒక్కరే ప్లాంట్ లోకి వెళ్లేందుకు అనుమతి లభించడంతో ఆయన వెళ్లి అధికారులను ప్లాంటు యొక్క పరిస్థితిపై అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంట్ వెలుపలకు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆధునిక మానవ జీవితం విద్యుత్ సరఫరాతో ముడిపడి ఉండటం వలన తెలంగాణలో ఎలాంటి లోటు రాకూడదన్న ఉద్దేశంతో గత ప్రభుత్వ హాయంలో కేసీఆర్ దూరదృష్టితో భారత దేశంలోనే అతిపెద్ద 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టామన్నారు. అప్పట్లోనే ప్లాంటు ఉత్పత్తికి 13000 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం ఉన్నప్పటికీ, 14000 మెట్రిక్ టన్నుల సరఫరా చేసే విధంగా సింగరేణితో ఒప్పందం జరిగిందన్నారు. ఎలాంటి గ్రేడ్ బొగ్గుతో అయినా విద్యుత్ ఉత్పత్తి జరిగేలా అధునాతన టెక్నాలజీతో ప్లాంట్ నిర్మాణం కొనసాగింది అన్నారు. ఈ విషయాన్ని అధికారులు స్పష్టం చేస్తున్నప్పటికీ క 9 గ్రేడ్ బొగ్గు సరఫరా లేకపోవడం వలన విద్యుత్ ఉత్పత్తి ఆపేస్తున్నామంటూ ప్రభుత్వం పేర్కొనటం వారి చేతకానితనానికి నిదర్శనం అన్నారు. బొగ్గు క్వాలిటీ ఎక్కువగా ఉంటే ఉత్పత్తి ఎక్కువగా వస్తుందని, తగ్గితే ఉత్పత్తి కొంచెం తగ్గుతుంది కానీ అసలు ప్లాంటే నడవదని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. తెలంగాణ వచ్చేనాటికి రాష్ట్రంలో 6,700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే ఉండేదని, కానీ కెసిఆర్ 24 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించాలన్న లక్ష్యంతో కృషిచేసి తాము అధికారం కోల్పోయే నాటికి 19 వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం సాధించామని తెలిపారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని రైతులను సంక్షోభంలో పెట్టేందుకు థర్మల్ పవర్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తిని కుంటి సాకులతో నిలిపివేస్తుందని ఆరోపించారు. సింగరేణిలో 9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి అవుతుందని జనవరిలోనే సంబంధిత అధికారులు అధికారికంగా ప్రకటించారని. నాణ్యమైన బొగ్గును కర్ణాటక,ఆంధ్రప్రదేశ్ లకు అమ్ముకుంటూ తెలంగాణ రాష్ట్రంలో పవర్ ప్రాజెక్టులను నిలిపివేసే కుట్రకు ప్రభుత్వం తెరలేపిందని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో 24 గంటలు కరెంట్ సరఫరా జరిగితే నేడు రాష్ట్రంలో కరెంటు కోతలు ఏర్పడ్డాయని, పరిశ్రమలు జనరేటర్లతో నడిచే పరిస్థితి ఉందని, చివరకు రైతులు వ్యవసాయం చేయాలన్న డీజిల్ జనరేటర్ ల పై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు.

### స్థానికులకే ఉద్యోగాలు వచ్చేలా కొట్లాడుతాం :-

యాదాద్రి పవర్ ప్లాంట్ కోసం తమ విలువైన భూములను ఇచ్చిన రైతులకు పూర్తి న్యాయం జరిగేలా, స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా ప్రభుత్వంతో కొట్లాడుతామని మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. భూ నిర్వాసితులతోపాటు ఏ స్థాయి ఉద్యోగమైనా స్థానికులకే దక్కాలని తామునాడు తీర్మానం చేశామని కానీ ప్రస్తుత ప్రభుత్వం లక్షల రూపాయలు నొక్కేసి అడ్డదారుల్లో పక్క రాష్ట్రాల నుండి వచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెడుతుందని ఆరోపించారు. ప్రభుత్వానికి తెలంగాణ సోయి లేదన్నారు. ఉద్యోగాల్లో జరిగిన అక్రమాలపై అధికారులను నిలదీశామని, ఉద్యోగాలు పొందిన ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు రేషన్ కార్డు తదితర వివరాల అందజేయాలని అధికారులను కోరినట్లు ఆయన తెలిపారు. స్థానికులకు ఉద్యోగాలు దక్కేంతవరకు తన పోరాటం కొనసాగిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం సి కోటిరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్,మాజీ ఎంపి, ఎమ్మెల్యేలు బడుగుల లింగయ్య యాదవ్, నల్లమోతు భాస్కరరావు, కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిషోర్, ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, తిప్పన విజయసింహా రెడ్డి, రాష్ట్ర నాయకులు పిల్లుట్ల రఘు, నరసింహారెడ్డి, రామచందర్ నాయక్, పల్లె రవి, చింతల వెంకటేశ్వర రెడ్డి, చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తాటికొల్‌లో వైభవంగా వినాయక లడ్డూ వేలం పాట రూ.1,25,116కు దక్కించుకున్న జూలూరు కోటేష్

**దేవరకొండ, సెప్టెంబర్ 24,(ప్రజా జ్యోతి) :**

తాటికొల్ గ్రామంలోని శివాలయం వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలం పాట భక్తుల ఉత్సాహం, తీవ్ర పోటీ నడుమ సాగింది. గ్రామానికి చెందిన పలువురు భక్తులు ఈ వేలంలో పాల్గొనగా, చివరకు జూలూరు కోటేష్ (తండ్రి వాసుదేవులు) అత్యధికంగా రూ. 1,25,116/- పలికి లడ్డూను సొంతం చేసుకున్నారు.లడ్డూను దక్కించుకున్న జూలూరు కోటేష్‌ను శివాలయ దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామస్థులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. స్వామివారి లడ్డూ ప్రసాదం తమకు దక్కడం పట్ల కోటేష్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శివాలయ దేవస్థానం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. లడ్డూ వేలం ద్వారా సేకరించిన మొత్తాన్ని శివాలయ అభివృద్ధి పనులకు, ఉత్సవాల నిర్వహణకు వినియోగించనున్నట్లు వెల్లడించారు. నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసిన భక్తులకు, గ్రామస్థులకు కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శివాలయ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు ఎరుకలి వెంకటేష్, ఉపాధ్యక్షుడు బొడ్డు అంజి, ప్రవీణ్, సతీష్, అనిల్, గణేష్ చింటు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎన్ఎస్ఎస్ డే వేడుకలు

**ఆలేరు సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలేరులో 57 ఎన్ఎస్ఎస్ డే వేడుకలను కళాశాల ప్రిన్సిపల్ రాజారం, నల్లపూలు ముత్యాలు. గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ డే ఆవిర్భావం గురించి ఇంటిగ్రేషన్ క్యాంపు స్పెషల్ క్యాంపు రెగ్యులర్ ఆక్టివిటీస్ గురించి వివరించారు. ఎన్ ఎస్ ఎస్ వాల్ ఇంటర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్వచ్ఛభారత్ డ్రస్సు అవేర్నెస్ ఎయిడ్స్ అవేర్నెస్ లీడర్షిప్ క్వాలిటీస్ పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లేశం, ఐక్య సి కోఆర్డినేటర్ ఎన్సి సౌజన్య అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ రవీందర్ కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ భారతి, నందకుమార్ వెంకటేశ్వర్లు జానయ్య జ్యోతి చైతన్య అనిత లక్ష్మి వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణను మళ్లీ చీకట్లోకి నెడుతున్న కాంగ్రెస్ సర్కార్:

## - మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ధ్వజం



**దేవరకొండ, సెప్టెంబర్ 24, (ప్రజా జ్యోతి) :**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం, చేతకానితనం వల్లే రాష్ట్రం మళ్లీ చీకటి రోజుల వైపు వెళ్తోందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం, యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిచిపోవడంపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై పలు ప్రశ్నలను సంధించారు: బొగ్గు ఉన్నా విద్యుత్ ఉత్పత్తి ఎందుకు ఆపారు?: రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే యాదాద్రి పవర్ ప్లాంట్‌ను నడపకుండా తెలంగాణ ప్రజలకు కరెంట్ కష్టాలు తెచ్చిపెడుతోంది. జి-9 బొగ్గు పుష్కలంగా ఉన్నా కొరత ఎందుకు?: ప్లాంట్‌కు అవసరమైన జి-9 గ్రేడ్ బొగ్గు పుష్కలంగా అందుబాటులో ఉన్నప్పటికీ, అబద్ధాలు చెప్తూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.

**అబద్ధాల పాలన ఇంకెంత కాలం?:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటూ 24 గంటల నిరంతర విద్యుత్ అందిస్తే, నేడు కాంగ్రెస్ సర్కార్ కరెంట్ కోతలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. అబద్ధాలతో తెలంగాణను ఇంకెంత కాలం పాలిస్తారు ?ప్రభుత్వానికి డిమాండ్: యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను తక్షణమే పూర్తి స్థాయిలో నడిపించాలని, రాష్ట్రవ్యాప్తంగా సాగుకు, గృహ అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. రైతులను, ప్రజలను ఇబ్బంది. పెడితే బీఆర్ఎస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ప్రజాసేవతోపాటు మానవత్వంలో ముందుంటామని చాటుకున్న 108 సిబ్బంది

- 15 వేల నగదు మొబైల్ ఆస్పత్రి సిబ్బందికి అప్పగించిన 108 ప్రజా సేవకులు
- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించిన 108 సిబ్బంది

**ఆలేరు సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి)**

జనగామ జిల్లా వడ్లకొండ గ్రామానికి చెందిన మహేష్ వ్యక్తి బైక్ పై హైదరాబాదు నుండి స్వంత గ్రామం వడ్లకొండకు ప్రయాణిస్తున్న






సమయంలో ఆలేరు పట్టణ కేంద్రంలో అకస్మాత్తుగా జారిపడి కింద పడిపోయాడు అతనికి గాయాలయిన్ స్పృహలో లేకపోవడం వలన 108కు సమాచారం అందించిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని 108 సిబ్బంది గాయాలైన మహేష్ కు నాణ్యమైన ప్రథమ చికిత్సను అందిస్తూ ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో మహేష్ దగ్గర 15000 రూపాయలను మరియు అతని యొక్క మొబైల్ ను అక్కడ ఉన్న స్థానికులు అందజేయడం జరిగింది ఆ యొక్క నగదును వస్తువులను ఆలేరు108 సిబ్బంది మానవత్వంతో హాస్పటల్ సిబ్బందికి ఆలేరులో అందజేయడం జరిగింది ఈఎంటి వెంకటేష్ మరియు పైలెట్ ప్రశాంత్ లను ప్రజలు హాస్పటల్ సిబ్బంది మానవత్వంతో అతని యొక్క నగదును మొబైల్ ను అందజేసినందుకు ప్రశంసించారు.

ప్రజాజ్యోతి
శుక్రవారం 25 సెప్టెంబర్ 2026

# భూమి ఉన్న ప్రతీ రైతు తప్పకుండా ఫార్మర్ రిజిస్ట్రేషన్ (రైతు ఐడి) చేసుకోవాలి

- శరాజిపేట ఏఈఓ భార్గవి - ఈ నెల 30వ తేదీ లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ (రైతు ఐడి) చేసుకోవాలి

ఫార్మర్ రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడి) తోనే విత్తనాలు, ఎరువులు మరియు పంటల నమోదు మరియు కొనుగోలు

**ఆలేరు సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**





ఫార్మర్ రిజిస్ట్రీ రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ఇంకా చేసుకోని రైతులు తమ సమీప వ్యవసాయ కార్యాలయంలో , మీసేవ కార్యాలయంలో మరియు జూజ సెంటర్లలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోగలరని శరాజీపేట వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవి తెలిపారు. శరాజీపేట గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ క్యాంపులో భాగంగా మాట్లాడుతూ శరాజీపేట రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని కోరారు. ఆగస్టు 13వ తేదీ 2026 వరకు భూమి రిజిస్ట్రేషన్ అయిన ప్రతి ఒక్క రైతు ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని కోరారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్లు భాగంగా రైతుల యొక్క వ్యక్తిగత వివరాలు మరియు ఆధార సంఖ్య మరియు భూమి వివరాలను నమోదు చేయడం ద్వారా ఒక విశిష్టమైన గుర్తింపు సంఖ్యను ప్రభుత్వం జారీ చేస్తుంది. ఈ విశిష్ట సంఖ్య (ఫార్మర్ ఐడి) ఆధారంగానే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు, పంటల నమోదుకు ,పంటల విక్రయానికి మరియు ఎరువుల సరఫరాకు ఈ ఐడి కీలకం కావున ఇప్పటివరకు రైతులు ఎవరైతే ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకోలేదో వారు వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్(ఫార్మర్ ఐడి) నమోదు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంతి మధు గారు,వార్డు సభ్యులు మరియు పంచాయతీ కార్యదర్శి ,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతో పౌష్టికాహారం తీసుకోవాలి

## కడపర్తి అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమం

**నల్లగొండ సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**



పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ మండలం కడపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు 1, 2లో గురువారం




అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో అశ్రా అంజుం గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు హాజరైన గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహారంపై క్విజ్ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవాని, అంగన్వాడీ టీచర్లు లింగమ్మ, రాజేశ్వరి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఎస్ఐ చిరంజీవి

**నాగారం, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:**



అకాల వర్షాలతో చెరువులు, కుంటలు నిండిపోయి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగారం ఎస్ఐ చిరంజీవి సూచించారు. గురువారం పస్తాల గ్రామ సమీపంలోని తాళ్లకుంటను పరిశీలించిన ఆయన, వాగులు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రవాహ ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దాటవద్దని సూచించారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ బుక్క శ్రీనివాస్ కిషోర్, గ్రామస్తులు ఉన్నారు.

# రూ.45,001కు గణపతి లడ్డూ... దక్కించుకున్న గోవింద్ కిరణ్

**గరిడేపల్లి,సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి):**

విజయపురి కాలనీలో సౌజన్య శాంతినికేతన్ స్కూల్ ప్రాంగణం లో వినాయక నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, మంగళహారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన గణప తి లడ్డూ వేలం ఉత్సాహంగా సాగింది. పలువురు భక్తులు వేలంలో పాల్గొనగా గోవిందు కిరణ్ రూ.45,001కు లడ్డూను దక్కించుకున్నారు. నిర్వాహకు లు ఆయనను అభినందించారు. గణనాథు డి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని స్థానికులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, కిషన్,నరేందర్,గోవింద్ కిరణ్, సోమనాథ్,వెంకటరెడ్డి,సందీప్, భరత్ కుమార్,బన్నీ,కమలాకర్,సుజిత్, రామ్‌చరణ్,చిన్నారి,హాసిని తది తరులు పాల్గొన్నారు.



# దేవరకొండ ఖిల్లాకు మహర్దశ

- రూ.75 లక్షలు మంజూరు.. ఖిల్లా గుట్ట అభివృద్ధికి రూ.5 కోట్లతో పనులు
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో శంకుస్థాపన చేయిస్తాం
- రోప్‌వే ఏర్పాటుపై ఆలోచన.. ఇండోర్ స్టేడియం పూర్తిచేస్తాం
- యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు స్పోర్ట్స్ అకాడమీకి ప్రాధాన్యం
- ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా యువ టూరిజం క్లబ్ పోటీల్లో ఎమ్మెల్యే బాలు నాయక్





**దేవరకొండ, సెప్టెంబరు 24, (ప్రజా జ్యోతి) :**

దేవరకొండ ఖిల్లా, ఖిల్లా గుట్టను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఖిల్లా అభివృద్ధికి ఇప్పటికే రూ.75 లక్షలు మంజూరయ్యాయని, ఖిల్లా గుట్ట సమగ్ర అభివృద్ధి కోసం సుమారు రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును దేవరకొండకు తీసుకొచ్చి రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించనున్నట్లు వెల్లడించారు.ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేవరకొండ మున్సిపల్ (ఖిల్లా) పార్క్‌లో నిర్వహించిన యువ టూరిజం క్లబ్ జిల్లా స్థాయి పోటీలకు ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతానికి చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పరంగా ఎంతో ప్రత్యేకత ఉందన్నారు.

### ఖిల్లాపై పూర్ణకుంభం.. ప్రత్యేక చరిత్ర

దేవరకొండ ఖిల్లాకు ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసీ బస్సులపై దేవరకొండ ఖిల్లా, పూర్ణకుంభం గుర్తులు కనిపించేవని తెలిపారు. దేవరకొండ ఖిల్లా ఈ ప్రాంతానికి చారిత్రక ప్రతీకగా నిలిచిందని, దాని వైభవాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.ఖిల్లా గుట్టను పర్యాటకంగా అభివృద్ధి



చేయడంతో పాటు సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

### ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటు చేసే ఆలోచన

దేవరకొండ ఖిల్లాకు వచ్చే పర్యాటకులను ఆకర్షించే విధంగా రోప్‌వే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. రోప్‌వే ఏర్పాటుతో ఖిల్లా ప్రాంతానికి మరింత పర్యాటక ఆకర్షణ పెరుగుతుందని, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### యువత కోసం ఇండోర్ స్టేడియం

దేవరకొండ నియోజకవర్గ యువతలో క్రీడా ప్రతిభకు కొదవలేదని ఎమ్మెల్యే అన్నారు. యువత తమ ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో చాటుకునేలా క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.
స్పోర్ట్స్ అకాడమీకి అనుగుణంగా ఇండోర్ స్టేడియాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ ఉన్న యువతకు శిక్షణ, అవసరమైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

### ఆసియా స్థాయిలో ప్రవళిక ప్రతిభ

డిండి మండల కేంద్రానికి చెందిన నారిమళ్ల ప్రవళిక అంతర్జాతీయ క్రీడా వేదికపై ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడం దేవరకొండ నియోజకవర్గానికి గర్వకారణమని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ఇలాంటి ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి సరైన శిక్షణ, వసతులు కల్పిస్తే మరెంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉందన్నారు.

### పర్యాటక ప్రాధాన్యంపై యువతకు అవగాహన

విద్యార్థులు, యువతకు పర్యాటక రంగంపై అవగాహన కల్పించడంతో పాటు తమ ప్రాంతంలోని చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయాలని ఎమ్మెల్యే



సూచించారు. సోషల్ మీడియా వంటి ఆధునిక వేదికలను ఉపయోగించుకుని దేవరకొండ ఖిల్లా విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.యువ టూరిజం క్లబ్‌ల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు స్థానిక చరిత్ర, కళలు, సంస్కృతి, వారసత్వ సంపదపై అవగాహన కల్పించవచ్చన్నారు.

### పాతబజారులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

దేవరకొండ పట్టణ అభివృద్ధిలో భాగంగా పాతబజారు ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావడంతో పాటు కార్యాలయాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు.

### కొండమల్లేపల్లిలో మోటార్ వెహికల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

కొండమల్లేపల్లిలో మోటార్ వెహికల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం మంజూరైందని, దాని ఏర్పాటును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు రవాణా సంబంధిత సేవలు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### పర్యాటకాభివృద్ధితో ఉపాధి అవకాశాలు

దేవరకొండ ఖిల్లా, ఖిల్లా గుట్టను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే అన్నారు. పర్యాటక రంగం అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. స్థానిక కళలు, హస్తకళలు, ఆహార ఉత్పత్తులు, చిన్న వ్యాపారాలకు కూడా పర్యాటక రంగం ద్వారా ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులతో పాటు మున్సిపల్ చైర్పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, హనుమంత వెంకటేష్ గౌడ్, మహమ్మద్ రైస్, కౌన్సిలర్లు, మారుపాకుల సురేష్ గౌడ్, లోకసాని శ్రీధర్ రెడ్డి, కిన్నెర హరికృష్ణ, ఉమేర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యాశాఖ అధికారులు, యువ టూరిజం క్లబ్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరులో ఘనంగా వినాయక నిమజ్జనం

**ఆలేరు సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామపంచాయతీ వద్ద వినాయక నిమజ్జనం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పొరునంది భాస్కర్ హాజరై పూజలో పాల్గొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుధారాణి శ్రీపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ గాజుల దశరథ, మాజీ సర్పంచ్ శంకరయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ లావణ్య వెంకటేష్, బాలస్వామి ,లక్ష్మయ్య, బిక్షపతి సురేష్ చందు మల్లికార్జున్ మల్లేష్ కుమార్ పరమేష్ మహేష్ కరుణాకర్ శ్రీకాంత్ హరిబాబు మల్లేష్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీలో చేసిన పనుల పరిశీలన

**ఆలేరు సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం షారాజుపేట గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణంలో ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్ గ్రామసభ గురువారం గ్రామ సర్పంచ్ కంతి మధు నిర్వహించారు. ఈ సందర్భంగా 2025 -2026 సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పనిలో భాగంగా చేపట్టిన పనుల రిజిస్టర్ లను అదేవిధంగా గ్రామంలో ఎంత మందికి పెన్షన్ దారులకు పెన్షన్లు వస్తున్నాయి అని వివరాలను గ్రామ సభలో తనిఖీ బృందం ఎస్ఆర్పి వెంకన్న డిఆర్పి రజిత చదివి వినిపించారు. గ్రామంలో చిన్న చిన్న సమస్యలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ మానస, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, వార్డు సభ్యులు గ్రామ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# సాయిబాబా దేవాలయ 26వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం

## - ట్రస్ట్ చైర్మన్ బొట్ల పరమేశ్వర్





**ఆలేరు, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని సాయిబాబా దేవాలయ 26వ వార్షికోత్సవాన్ని భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు దేవాలయ ట్రస్ట్ చైర్మన్ బొట్ల పరమేశ్వర్ తెలిపారు. గురువారం ఆలేరులోని సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో ఆయన అధ్యక్షతన ట్రస్ట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొట్ల పరమేశ్వర్ మాట్లాడుతూ.. దేవాలయ 26వ వార్షికోత్సవాన్ని వచ్చే నెల 26వ తేదీ సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ట్రస్ట్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. వార్షికోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సాయిబాబా స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. వార్షికోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ట్రస్ట్ సభ్యులు, భక్తులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. దేవాలయంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. సాయిబాబా దేవాలయం అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో అవసరమని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్టించిన గణేష్ విగ్రహం నిమజ్జన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడికి వీడ్కోలు పలికారు. ఈ సమావేశంలో ట్రస్ట్ సభ్యులు కామిటికారి అశోక్, ఎలగందుల శ్రీనివాస్, సముద్రాల సత్యం, సముద్రాల శ్రీనివాస్ (ఐడియా), పల్లా వెంకట్ రెడ్డి, సీతా నవీన్, పడగల రాజేశ్వర్, కందుల నర్సింగరావు, మొగుళ్ల రాజిరెడ్డి తదితర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


# మూసీకి భారీ వరద ప్రవాహం..

# గేట్లు ఎత్తేందుకు అధికారుల సన్నద్ధం

## - నిండుకుండలా మూసీ రిజర్వాయర్..

## దిగువ ప్రాంతాలకు ముందస్తు హెచ్చరికలు







**నల్లగొండ సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

మూసీ రిజర్వాయర్ కు ఎగువ నుంచి వస్తున్న వరదతో నిండుకుండలా మారుతోంది. గత రెండు రోజులుగా ఎగువ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైన సమయంలో గేట్లు ఎత్తేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మూసీ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్) 645 అడుగులు కాగా.. ప్రస్తుతం 640.58 అడుగులకు చేరింది. 4.46 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి గాను 3.35 టీఎంసీల నీరు ఉంది. గత 24 గంటల్లో 1,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మూసీ గేట్లు ఎత్తాల్సిన పరిస్థితి ఏర్పడితే దిగువ ప్రాంతాలపై ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. సూర్యాపేట, పెన్‌పహాడ్, పాలకీడు మండలాల్లోని రత్నాపురం, రామవరం, హనుమాన్ తండా, వెంకట్రాంపూర్ టేకుమట్ల, నంద్యాలగూడెం, కొంకతిమ్మని అన్నారం, సర్కిల్‌పేట, కాసరాబాద్, అనాజిపురం, అనంతారం, దోసపహాడ్, సజ్జాపురం, గంటవారిగూడెం, ఎల్లారం, సోమవరం, చింతకుంట్ల, పులగంబండ తండా, మూసీ ఒడ్డు సింగారం, ఎల్లాపురం, శూన్యపహాడ్ గ్రామాలు. నల్గొండ జిల్లా: కేతేపల్లి, మాడుగులపల్లి, మిర్యాలగూడ మండలాల్లోని బొప్పారం, కాసనగోడు, చికటిగూడెం, కొత్తపేట, ఉప్పలపహాడ్, కొప్పోలు, భీమారం, ఆమనగల్, లక్ష్మీదేవిగూడెం, రావులపెంట, రాజాపేట, నర్సింహులగూడెం, తక్కెళ్లపాడు, కాల్వపల్లి, ఆళ్లగడప, రాయనిపాలెం, ములకల కాల్వ, కేశవాపురం, తుంటుకుంటవిల్ల, వాడపల్లి, వజీరాబాద్ గ్రామాలు. మూసీ పరివాహక, దిగువ ప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లరాదని అధికారులు స్పష్టం చేశారు. నది పరిసరాల్లో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గేట్లు ఎత్తే సమయంలో అధికారులు చేసే సూచనలు, భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

# అర్థశాస్త్రంలో డాక్టరేట్, పీహెచ్డీ పట్టా సాధించిన గిరిజన బిడ్డ

## - రాజస్థాన్ 'సన్‌రైజ్ యూనివర్సిటీ' నుండి పట్టా ప్రధానం

## - గ్రామీణ పేదల మైక్రోఇన్సూరెన్స్‌పై ప్రత్యేక అధ్యయనం

**పెన్‌పహాడ్, సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి):**

అకుంఠిత దీక్ష, పట్టుదల ఉంటే పేదరికం చదువుకు అడ్డుకాదని నిరూపించాడు ఆ గిరిజన యువకుడు. కష్టాల తండా నుండి వచ్చి, అర్థశాస్త్రంలో అత్యున్నతమైన పీహెచ్‌డీ పట్టా సాధించి సమాజానికి ఆదర్శంగా నిలిచాడు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నూర్జహాన్ పేట తండాకు చెందిన రైతు బిడ్డ భూక్యా బాలు ఈ అరుదైన ఘనత సాధించారు.రైతు బిడ్డగా.. చిన్న వ్యాపారిగా..లాచిరామ్ కుమారుడైన భూక్యా బాలు ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ చదువుపై ఉన్న మక్కువతో చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూనే తన ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. 2019లో రాజస్థాన్ రాష్ట్రం ఆళ్వార్ జిల్లా రాంఘడ్‌లోని ప్రసిద్ధ లి'సన్‌రైజ్ యూనివర్సిటీ'లిలో అర్థశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పరిశోధకుడిగా చేరారు.ప్రముఖ ప్రొఫెసర్ అవధేశ్ కుమార్ దూబే పర్యవేక్షణలో బాలు తన పరిశోధనను పూర్తి చేశారు. భారతదేశంలోని పేద గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించే "డిమాండ్, సప్లై, మైక్రోఇన్సూరెన్స్ పథకాలు" అనే సామాజిక ప్రాధాన్యత కలిగిన అంశంపై ఆయన లోతైన అధ్యయనం చేశారు. ఈ పరిశోధనకు గాను ఈ సెప్టెంబర్‌లో (2026) యూనివర్సిటీ ఆయనకు అధికారికంగా డాక్టరేట్ పట్టాను అందజేసింది.గిరిజన ప్రాంతం నుండి ఎదిగి, జాతీయ స్థాయి యూనివర్సిటీలో డాక్టరేట్ సాధించి 'డాక్టర్ భూక్యా బాలు'గా



తిరిగొచ్చిన యువకుడిని చూసి మొర్సకుంట తండా, నూర్జహాన్ పేట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో అవరోధాలను దాటి తండా గర్వపడేలా పీహెచ్‌డీ సాధించడం చాలా సంతోషంగా ఉందని, ఈ విజయం ఎంతో మంది గ్రామీణ విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని బాలు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు.



# వర్షాలకు కొట్టుకుపోయిన ప్రధాన రహదారి

## - పట్టించుకోని అధికారులు

## - బిఎంఎస్ జిల్లా కన్వీనర్ అనంతుల సతీష్





**పెన్ పహాడ్ సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):**

పెన్ పహాడ్ మండలం చీదేళ్ల గ్రామం నుంచి చెట్ల ముకుందాపురం వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిని కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడం ప్రజలకు ప్రాణసంకటంగా మారిందని సామాజిక కార్యకర్త, భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కన్వీనర్ అనంతుల సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాల కారణంగా రహదారి పలుచోట్ల కోతకు గురై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయని, ప్రస్తుతం రోడ్డు మొత్తం బురదమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ రహదారిని చీదేళ్లతో పాటు చెట్ల ముకుందాపురం పరిసర ప్రాంతాల ప్రజలు నిత్యం వినియోగిస్తుంటారని, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పొలాలకు వెళ్లే రైతులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సైతం ఈ మార్గంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమన్నారు.ప్రజలు ఎన్నిసార్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టే వరకు కనీసం తాత్కాలికంగా మోరం పోసి గుంతలను పూడ్చి రాకపోకలకు అనుకూలంగా చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తే గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే ఏ ఐ కె ఎం ఎస్ జాతీయ 4 వ మహాసభలు చరిత్రను సృష్టించనున్నాయి

## - కల్లెపు అడివయ్య,అద్యక్షులు, ఇక్కిరి సహదేవ్ జిల్లా ఉపాధ్యక్షులు, ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా కార్యవర్గం

**ఆలేరు సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**

ఖమ్మం లో జరుగు అఖిల భారత రైతు.కూలీ సంఘం(ఏ ఐ కె ఎం ఎస్) జాతీయ 4 వ మహాసభ లు చరిత్రను సృష్టిస్తాయని ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కళ్లెపు అడివయ్య జిల్లా ఉపాధ్యక్షులు ఇక్కిరి సహదేవ్ అన్నారు.గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని టంగుటూరులో అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడివయ్య సహదేవ్ మాట్లాడుతూ నాడు కరోనా కష్టాల కల్లోల కాలం లో ప్రజలందరూ ఇండ్లల్లో లాక్ డౌన్ తో బయటికి ఎల్లకుండా బంధించబడిన సమయంలో మోడీ కేంద్ర గవర్నమెంట్ మూడు ప్రజా,రైతు వ్యతిరేక చట్టాలను తెస్తే దేశ రైతాంగం వీరోచితంగా పోరాడి త్రిప్పి కొట్టిందని,ఆ మహత్తర పోరాటంలో ఏ ఐ కె ఎం ఎస్ క్రియాశీలక పాత్రను పోషించిందని అలాంటి ఏ ఐ కె ఎం ఎస్ తన జాతీయ మహాసభలను ఖమ్మం లో జరుపుకోబోతుందని చెప్పారు. ప్రస్తుతం మోడీ బీ జే పీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని,రైతాంగాన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పేరుతో దేశ వ్యవసాయ ఉత్పత్తులను, ఆహార పదార్థాలు,ఇతర అనేక వస్తువులను కాదని,పూర్తిగా విదేశీ వస్తువులపై ఆధారపడే విధంగా,విదేశీ వస్తువులనే కొనే విధంగా నేడు మోడీ ప్రభుత్వం దుర్మార్గమైన ఒప్పందాలను తెస్తుందని, ప్రజా,రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న ఈ సమయంలో ఏ ఐ కె ఎం ఎస్ జాతీయ 4 మహాసభలను జరుపుకుంటుందని ఈ విధానాలకు వ్యతిరేకంగా ఏ ఐ కె ఎం ఎస్ అఖిల భారత స్థాయి లో పెద్ద ఎత్తున పోరాడిందని ఈ నేపథ్యంలోనే జాతీయ మహాసభలు ఖమ్మం లో జరగడం ప్రత్యేకతను సంతరించుకుంటుందని,చెప్పుకోదగిన ఆకర్ష ణీయంగా నిలిచాయని అన్నారు.రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పై చర్చలు,భవిష్యత్ కార్యాచరణను,ఐక్య రైతాంగ ఉద్యమాన్ని నిర్మిచే కర్తవ్యాన్ని రూపొందించుకుంటుందని ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య,జిల్లా ఉపాధ్యక్షులు ఇక్కిరి సహదేవ్ తెలిపారు.ఈ



కార్యక్రమంలో పి ఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్ సీత, ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా నాయకులు చిరబోయిన కొమురయ్య పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు మారుజోడు సిద్దేశ్వర్, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల సిద్దులు, ప్రజా సంఘాల నాయకులు మారుజోడు కుమార్, జాలపు బిక్షం రెడ్డి, ఇక్కిరి నరసింహులు, కూకట్ల బిక్షపతి,భూపెల్లి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా గణనాథుని నిమర్జనం

**భువనగిరి,రూరల్ సెప్టెంబర్ 24(ప్రజాజ్యోతి)**

భువనగిరి మండలం బి ఎన్ తిమ్మాపురం గ్రామంలో గ్రామ,పంచాయతీ గణేష్ ఉత్సవ కమిటీ,గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి,ఆధ్వర్యంలో ఘనంగా గణనాథుడు నిమజ్జోత్సవ కార్యక్రమం నిర్వహించారు ముందుగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తదనంతరం మోర రామ్ రెడ్డి గారి సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు. డోలు వాయిద్యాలు,కాళికామాత వేషధారణ అవతారంలో ఉన్న కళాకారులతో గ్రామ పురవీధులలో భక్తి శ్రద్ధలతో ఘనసాధుని శోభాయాత్ర, శోభాయమానంగా నిర్వహించిన అనంతరం గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్విండో చైర్మన్ ఎడ్ల సత్తి రెడ్డి,ఉప సర్పంచ్, వార్డు,సభ్యులు, సమి బాయ్,ఉత్సవ కమిటీ సభ్యులు మోర నర్సి రెడ్డి, దొంకేన అశోక్,దర్శన్ రెడ్డి,మోర రాం రెడ్డి,లింగా రెడ్డి,సింగిల్విండో డైరెక్టర్ ఆంజనేయులు,వల్లందాస్ పరమేష్,లక్ష్మణ్ మహిపాల్,శ్రీశైలం సుధాకర్,అశోక్,బాబ గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.





# నాలాల ఆక్రమణలతో.. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు

## - ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

## మూడు రోజుల్లో ఆక్రమణలు తొలగించి నాలాలను పునరుద్ధరించాలి:

## - డీఎఫ్ఓ దామోదర్‌రెడ్డి



**నడిగూడెం, సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి,**

మండల కేంద్రంలో నాలాలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక లోతట్టు ప్రాంతాల్లోకి చేరుతోంది. గురువారం ఉదయం కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వర్షపు నీరు చేరిన ఇళ్లను మండల ప్రత్యేక అధికారి, డీఎఫ్ఓ దామోదర్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్. మంగ, సర్పంచ్ దున్నా శ్రీనివాస్తో కలిసి పరిశీలించారు. నాలాల ఆక్రమణల కారణంగానే వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.సమస్యను పరిశీలించిన దామోదర్‌రెడ్డి నాలాల ఆక్రమణలను గుర్తించి మూడు రోజుల్లో తొలగించాలని, నాలాలను పునరుద్ధరించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆక్రమణదారులు గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# రైతుల పంట పొలాలను కాపాడాలి



**ఆలేరు సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్ల గూడెం గ్రామంలో పందులు రైతుల పంట పొలాలు నాశనం చేస్తున్నాయని ఈ విషయంపైచట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఆ గ్రామ సర్పంచ్ తో పాటు రైతులు నేడు తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తాసిల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందించారు. అదేవిధంగా ఆలేరు ఎస్బిహెచ్ఓ ఉదయ్ కిరణ్ కు ఫిర్యాదు చేశారు.ఈ విషయంపై తాసిల్దార్, ఎస్బిహెచ్ఓ స్పందిస్తూ రైతుల పంట నష్టం జరగకుండా తగు చర్యలు తీచుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుండ్లగూడెం గ్రామ సర్పంచ్ ఏసిరెడ్డి మంజుల మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ తోపాటు వార్డు సభ్యులు గ్రామ రైతులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

# క్రీడలకు పెద్దపీట.. గ్రామీణ ప్రాంతాల నుంచే అంతర్జాతీయ క్రీడాకారులు తయారు కావాలి

## - డిండి జెడ్పీహెచ్ఎస్‌లో 70వ ఎస్‌జీఎఫ్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్

## - దేవరకొండ ప్రాంతంలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తా

## - నారిమల్ల ప్రవల్లిక అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణం సాధించడం మన ప్రాంతానికే గర్వకారణం















**డిండి, సెప్టెంబర్ 24, (ప్రజా జ్యోతి) :**

విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇచ్చినప్పుడే విద్యార్థుల్లో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.డిండి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గురువారం నిర్వహించిన 70వ దేవరకొండ నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్ సెలెక్షన్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఈ పోటీలు సెప్టెంబర్ 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నారు.

### జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభం

ముందుగా ఎమ్మెల్యే బాలు నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొని క్రీడాకారులకు ఉత్సాహం కల్పించారు. అనంతరం పీఈటీలు, ఉపాధ్యాయులతో కలిసి క్రీడా మైదానానికి చేరుకుని రిబ్బన్ కట్ చేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. విద్యార్థులతో మమేకమై క్రీడల ప్రాధాన్యతపై మాట్లాడారు.కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో తదితర క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు.పాఠశాల స్థాయి నుంచే క్రీడా ప్రతిభను వెలికితీయాలి

### ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ..

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ దాగి ఉంది. అలాంటి ప్రతిభను పాఠశాల స్థాయి నుంచే గుర్తించి సరైన శిక్షణ అందించాలి అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులు, శిక్షణ, క్రీడా ప్రతిభను అభివృద్ధి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం 2025లో ప్రత్యేక క్రీడా పాలసీ తీసుకొచ్చింది. గ్రామ, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిల నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహించి ప్రతిభను గుర్తించే విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది.

### దేవరకొండలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తా

దేవరకొండ నియోజకవర్గ ప్రాంతం అంటేనే క్రీడలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ప్రాంతం నుంచి మరింత మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు రావాలి. అందుకు అవసరమైన వసతులు కల్పించేందుకు నా వంతు కృషి చేస్తాను. దేవరకొండ ప్రాంతంలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయడానికి కృషి చేయడం నా బాధ్యత అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు.క్రీడాకారులకు శిక్షణ, మౌలిక వసతులు, కోచ్‌ల సహకారం అందితే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రతిభావంతులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు.

### డిండి బిడ్డ నారిమల్ల ప్రవల్లికకు అభినందనలు

మన డిండి ప్రాంతానికి చెందిన నారిమల్ల ప్రవల్లిక అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టు తరఫున స్వర్ణ పతకం సాధించడం మనందరికీ గర్వకారణం అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. 2026 ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన మహిళల 4x400 మీటర్ల రిలేలో నారిమల్ల ప్రవల్లిక సభ్యురాలిగా ఉన్న భారత జట్టు 3:33.62 నిమిషాల్లో స్వర్ణ పతకం సాధించింది. ప్రవల్లిక నల్లగొండ జిల్లాలోని డిండి మండలానికి చెందిన క్రీడాకారిణిగా, డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

### క్రీడా విశ్వవిద్యాలయం.. స్పోర్ట్స్ అకాడమీలకు ప్రాధాన్యం

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీలు, ఆధునిక క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. 2026లో రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఒలింపిక్స్, కామన్వెల్త్ స్థాయి శిక్షణ అందించేలా క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారికంగా వెల్లడించింది. క్రీడా రంగానికి బడ్జెట్‌ను గత కేటాయింపులతో పోలిస్తే 16 రెట్లు పెంచినట్లు ప్రభుత్వం 2025లో వెల్లడించింది. అలాగే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు అందిస్తున్నట్లు తెలిపింది.

### పాఠశాలల్లో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత

ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం విద్యాశాఖ సమీక్షలో స్పష్టం చేసింది. విద్యార్థుల్లో క్రీడా ఆసక్తిని పెంచడంతో పాటు అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలు, పరికరాలు, శిక్షణా వసతులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చదువులోనూ, ఆటల్లోనూ విద్యార్థులు రాణించాలి. ఈరోజు పాఠశాల మైదానంలో ఆడే విద్యార్థుల్లోనే రేపటి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఉంటారు. అందుకే ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహం అందేలా కృషి చేస్తాం అని బాలు నాయక్ అన్నారు.కార్యక్రమంలో దొంతినేని వెంకటేశ్వర్ రావు, ముత్యాల శశిధర్ రెడ్డి, నల్లగంతుల రవి, హనుమంతు వెంకటేష్ గౌడ్, మారుపాకుల సురేష్ గౌడ్, కిన్నెర హరికృష్ణ, విద్యాశాఖ అధికారులు, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దు

## - పాత ఇళ్లు, గోడలు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి.

## - ఎస్సై తేజస్విని



**నడిగూడెం, సెప్టెంబర్ 24, ప్రజాజ్యోతి:**

భారీ వర్షాల నేపథ్యంలో నడిగూడెం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఎస్సై తేజస్విని సూచించారు. వర్షాల కారణంగా వాగులు, చెరువుల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు వాటి వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా పిల్లలు, యువత సరదా కోసం వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.అదేవిధంగా విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, పాత ఇళ్లు, శిథిలావస్థలో ఉన్న గోడలకు దూరంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ నుంచి భారీ వర్షాల సూచనలు ఉన్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.వినాయక నిమజ్జనం సందర్భంగా కూడా అప్రమత్తత అవసరమని ఎస్సై పేర్కొన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా, పోలీసుల సూచనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకోవాలని కోరారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సై తేజస్విని విజ్ఞప్తి చేశారు.

# సంతోష్ నగర్‌లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు

## భక్తిశ్రద్ధలతో గణనాథుడి శోభాయాత్ర..

**నల్లగొండ సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్ పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీ 13వ వార్డు సంతోష్ నగర్‌లో గణేష్ మిత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో,





ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా పోరెండ్ల శివ టీం ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజించి, ఆశీస్సులు పొందారు.అనంతరం గణేష్ శోభాయాత్రను ఘనంగా ప్రారంభించారు. గణనాథుడి విగ్రహాన్ని కాలనీలోని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటపాటలు, భక్తి గీతాలు, ఆనందోత్సాహాల మధ్య శోభాయాత్ర కొనసాగింది. చిన్నారులు, మహిళలు, యువత, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు.ఈ సందర్భంగా కాలనీలో భక్తి, ఐక్యత, సోదరభావం వెల్లివిరిశాయి. గణేష్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను కాలనీవాసులు అభినందించారు. కార్యక్రమంలో పోరెండ్ల శివ టీం సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# సేవా స్ఫూర్తితో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు




**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి):**

మండలం దేశ్‌ముఖి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్1, యూనిట్2 ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. ఎన్. పావని, డా. ఎన్. పద్మమ్మ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజలకు సామాజిక బాధ్యత, సమాజ సేవపై అవగాహన కల్పించారు. అనంతరం పాటలు, వక్తృత్వం, నృత్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. శ్రీలత, డైరెక్టర్ కల్నల్ రాజా దత్తా పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# భారీ వర్షానికి కూలిన ఇల్లు

**నార్కట్ పల్లి, సెప్టెంబర్ 24 ( ప్రజా జ్యోతి):**

పట్టణ కేంద్రానికిచెందిన వర్రె మల్లికార్జున్ నివాసం గురువారం తెల్లవారుజామున వర్షానికి కూలీ పోవడంతోసమాచారం తెలుసుకున్న నార్కట్ పల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ వెంటనే స్పందించి అధికారులకు విషయం తెలియజేసి సహాయక చర్యలు అందేలాచేసి,అన్ని విధాలా సహాయశీ చేస్తానని ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమం లో వార్డ్ సభ్యులు వడ్డెగోని రామలింగం , జిల్లా మహేష్ , నాయకులు మేడబోయిన శ్రీను , గిల్లి మల్లేష్ , బషీర్ , పుల్లెంల వెంకట్ , తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

### - గుండ్ల సింగారం బ్రిడ్జికి వరద ఉధృతి

### - పరిశీలించిన మండల అధికారులు..

**నూతనకల్...సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి):**

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఎంఏ భారతి, ఎంపీడీవో సునీత ప్రజలకు సూచించారు.. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని గుండ్ల సింగారం బ్రిడ్జీకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి ప్రవాహ పరిస్థితిని, రాకపోకలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిడ్జిపై నీటి ప్రవాహం పెరిగిన సమయంలో ప్రజలు, వాహనదారులు ప్రమాద కరంగా రాకపోకలు సాగించకుండా తగిన జాగ్రత్తలు తీసు కోవాలని తెలిపారు.. నీటి పరివాహక ప్రాంతాలను వీక్షించేందుకు వచ్చే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. దగ్గరకు వెళ్లకుండా దూరం నుంచే వీక్షించాలని కోరారు.. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్య వేక్షించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.. వర్షాల పరిస్థితిపై నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు వారు మీడియాకు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ప్రజలు, స్థానిక రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు..



# న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యం నిరసిస్తూ....!

### - మిర్యాలగూడ బార్ అసోసియేషన్

### విధుల బహిష్కరణ, నిరసన

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 24, (ప్రజాజ్యోతి):**

ఈ నెల 22న, హైదరాబాద్‌లోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో న్యాయవాది షేక్ అఖీద్ జునైద్, మహిళా న్యాయవాది పిజ్జష పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించి, దౌర్జన్యానికి పాల్పడిన సంఘటనను మిర్యాలగూడ బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తు గురువారం 5 కోర్టుల్లో విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు . ఆయా కోర్టుల్లో పనులు స్థంభించాయి. సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడ బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం డిమాండ్ చేసింది . ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చట్టాలను గౌరవిస్తూ అమలు చేయాల్సిన పోలీసులే న్యాయవాదులపై అనుచితంగా దౌర్జన్యంగా ప్రవర్తించటం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



# ముప్పారం శ్రీ పార్వతీ రామలింగేశ్వరస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ గా శెట్టి వీరేశం

### - ఆలయ కమిటీ సభ్యులుగా గణపురం వెంకన్న,ఆదిముల్ల శ్రీను, కోట్ల నర్సింహ్మా, ఆలంపల్లి వెంకన్న, బైరోజు శివ లను నియామకం

**నిడమనూరు,సెప్టెంబర్ 24(ప్రజాజ్యోతి):**



మండలంలోని ముప్పారం శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ గా శెట్టి వీరేశం నియమిస్తున్నట్లు .గురువారం నల్లగొండ జిల్లా దేవదాయ శాఖ సూపరిండెంట్ పల్నాడు వెంకటలక్ష్మి పేర్కొన్నారు.అదేవిధంగా ఆలయకమిటీ సభ్యులుగా గణపురం వెంకన్న,ఆదిముల్ల శ్రీను,కోట్ల నర్సింహ్మా, ఆలంపల్లి వెంకన్న, బైరోజు శివ లను నియమిస్తూ దేవాదాయ శాఖ పాలక మండలి ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా దేవదాయ శాఖ సూపరిండెంట్ పల్నాడు వెంకటలక్ష్మి ,దేవాదాయ ఈవో సిరికొండ నవీన్ కుమార్ లఆధ్వర్యంలో ముప్పారం శివాలయం నూతన చైర్మన్ గా శెట్టి వీరేశం , కమిటీ సభ్యులను ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ శెట్టి వీరేశం మాట్లాడుతూ శివాలయం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.అదేవిధంగా తనను నియమించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి ,పెద్దలు మాజీ సిఎల్పీ నేత కుందూరు జానారెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అధేవిధంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్ విజయ్ కుమార్ , రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు యడవెల్లి వల్లభరెడ్డి ,రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు మేరెడ్డి కృష్ణ వివేక్,సర్పంచ్ ఆలంపల్లి రోజా కృష్ణ , ఉపసర్పంచ్ గణపురం కొండలు, మండల ముఖ్య నాయకులకు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ఈవో సిరికొండ నవీన్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు గూదె అనంతరాయ శర్మ, గ్రామ పెద్దలు , తదితరులు,పాల్గొన్నారు.

# బీసీ పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్

### - మాతృమూర్తి మృతి పట్ల కుటుంబ సభ్యులకు సానుభూతి

**చింతపల్లి, సెప్టెంబర్ 24, (ప్రజా జ్యోతి) :**



బీసీ పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్ గౌడ్ మాతృమూర్తి కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాతృమూర్తి మృతికి ఎమ్మెల్యే బాలు నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం



చేశారు. కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించి, జరిగిన విషాద ఘటన పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మాతృమూర్తిని కోల్పోవడం బాధాకరమని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన సానుభూతి ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలంపల్లి నర్సింహా, లోకసాని శ్రీధర్ రెడ్డి, మారుపాకుల సురేష్ గౌడ్, హనుమంతు వెంకటేష్ గౌడ్, హనుమంతు సాయి చంద్ర గౌడ్, చింతపల్లి నర్సింహా, వంగూరి రాజు, పగిళ్ల శీను, తుమ్మల శ్రీనివాస్ రెడ్డి, ఎర్ర కృష్ణ, పగిల్ల శ్రీను, వంగూరి నారయ్య, లాలికోట చెన్నయ్య, ముత్యాలు, వంగూరి శ్రీనివాసులు, లింగం, తిరుపతయ్య, శీను, లాలయ్య, బాలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వర్లను చేయడమే ప్రభుత్వ ధ్యేయం

**గుండాల సెప్టెంబర్ 24(ప్రజా జ్యోతి) :**



మహిళా సంఘాలను బలోపేతం చేసి, మహిళలను ఆర్థికంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం గుండాల మండలంలో మహిళా సంఘాలకు 8 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశారు. రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్ షాపును ఎమ్మెల్యే ప్రారంభించారు. తదనంతరం అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. గుండాల మండలం పాచిల్ల గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల, సింగిల్ విండో చైర్మన్ అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా,సర్పంచులు దేవన బోయిన ఐలయ్య, మచ్చ నాగిరెడ్డి, ఎంపీడీవో చండీరాణి మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# యువత గొంతును అణచలేరు.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

## -మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, సెప్టెంబర్ 24, (ప్రజా జ్యోతి) :



గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో యువత ఉత్సాహంగా మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ ఆరాధ్య నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాటలు పెట్టుకుంటే కేసులు నమోదు చేయడంపై దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సమాజంలో కేసీఆర్ అంటే కేవలం ఒక నాయకుడు కాదని, నాలుగున్నర కోట్ల ప్రజల గుండెల్లో కొలువైన ఆరాధ్య నాయకుడని కొనియాడారు. పండుగ వాతావరణంలో యువత తమ అభిమాన నాయకుడి పాటలు వాడుకుంటే పోలీసులను ప్రయోగించి కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో నడుస్తోంది. అనుముల రాజ్యాంగమా..? ఇందిరమ్మ రాజ్యమా..? లేక పోలీస్ రాజ్యమా..? అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, అక్రమ కేసులతో యువత గొంతును అణచలేరని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని, రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రమావత్ రవీంద్ర కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# 15 వేల నగదు మొబైల్ ఆస్పత్రి సిబ్బందికి అప్పగించిన 108 ప్రజా సేవకులు

### - రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించిన 108 సిబ్బంది

ఆలేరు సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారి వెంబడి గురువారం రోజున ఉదయం 11 గంటలకు మహేష్ జనగామ జిల్లా వడ్లకొండ గ్రామానికి చెందిన అనే వ్యక్తి బైక్ పై హైదరాబాదు నుండి స్వంత గ్రామం వడ్లకొండకు ప్రయాణిస్తున్న సమయంలో అకస్మాత్తుగా జారిపడి కింద పడిపోయాడు అతనికి గాయాలు అయి స్పృహలో లేకపోవడం వలన 108కు సమాచారం అందించిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని 108 సిబ్బంది గాయాలైన మహేష్ కు నాణ్యమైన ప్రథమ చికిత్సను అందిస్తూ ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .ఈ క్రమంలో మహేష్ దగ్గర 15000 రూపాయలను మరియు అతని యొక్క మొబైల్ ను అక్కడ ఉన్న స్థానికులు అందజేయడం జరిగింది. ఆ యొక్క నగదును వస్తువులను 108 సిబ్బంది మానవత్వంతో హాస్పటల్ సిబ్బందికి ఆలేరులో అందజేశారు. ఈఎంటి వెంకటేష్ మరియు పైలెట్ ప్రశాంత్ లను ప్రజలు హాస్పటల్ సిబ్బంది మానవత్వంతో అతని యొక్క నగదును మొబైల్ ను అందజేసినందుకు ప్రశంసించారు.

# భక్తి పక్కకు.. హంగామా ముందుకు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి)

గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగాల్సిన నిమజ్జన వేడుకలు కొన్నిచోట్ల యువత అత్యుత్సాహంతో హంగామాగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వినాయకుడిని భక్తితో సాగనంపాల్సిన సమయంలో డీజేలు, పెద్ద శబ్దాలు, కేరింతలు, నృత్యాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. వినాయకుడి నిమజ్జనం అనేది కేవలం వినోదం కోసం నిర్వహించే కార్యక్రమం కాదని, భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికతకు ప్రతీక అని పెద్దలు గుర్తుచేస్తున్నారు. భక్తిని పక్కనపెట్టి హంగామాకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఉత్సవాల అసలు ఉద్దేశమే మరుగునపడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యువత ఉత్సాహాన్ని ఎవరూ తప్పుపట్టడం లేదని, అయితే ఆ ఉత్సాహం భక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలతో కలిసినప్పుడే ఉత్సవాలకు మరింత గౌరవం లభిస్తుందని సూచిస్తున్నారు. గణనాథుడి నిమజ్జనాన్ని భక్తి భావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించి సంప్రదాయాలకు గౌరవం ఇవ్వాలని కోరుతున్నారు.

# ఆధ్యాత్మిక శోభతో శ్రీ భక్తాంజనేయస్వామి రథోత్సవం

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి):

పట్టణ కేంద్రంలోని అభినవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయంలో గురువారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం వైదిక సాంప్రదాయ పద్ధతిలో రథోత్సవాన్ని ప్రారంభించారు. భజన మండళ్ల కీర్తనల నడుమ పుష్పాలతో అలంకరించిన రథంపై కొలువుదీరిన శ్రీ భక్తాంజనేయస్వామి వారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అభినవ యూత్ అధ్యక్షులు జోగు రవీందర్, దేవాలయ అధ్యక్షుడు బల్ల దుర్వాసులు, కార్యదర్శి జోగు లక్ష్మినారాయణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





# చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల జిల్లా కన్వీనర్ గా ఆలేటి అనిల్

ఆలేరు సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల జిల్లా కన్వీనర్ గా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన ఆలేటి అనిల్ ను నియామకం చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవి బాధ్యతలు ఇచ్చినందుకు చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.



# చీడపీడల, తెగుళ్ల నివారణ పై అవగాహన సదస్సు

**చండూరు సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):-**

గురువారం చండూరు మండలం లోని తిమ్మారెడ్డి గూడెం రైతు వేదికలో  వ్యవసాయ శాఖ మరియు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), మునుగోడు డివిజన్ ఆధ్వర్యంలో రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మునుగోడు డివిజన్ ఆత్మ చైర్మన్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ పాల్గొన్నారు.  రైతులను ఉద్దేశించి ఆత్మ చైర్మన్ రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ వ్యవసాయ కార్యక్రమాలు, పంటల సాగులో పాటించాల్సిన మెళకువల పై అవగాహన కల్పించనున్నారు.అలాగే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లే దిశగా అడుగులు వేయాలి అని గో ఆధారిత వ్యవసాయం చేయాలనీ విచక్షణారహితంగా పురుగు మందుల వాడకం తగ్గించాలని రైతులకు తెలియజేయడం జరిగింది. అలాగే జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పప్పు దినుసులు మరియు పత్తి పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు ప్రధాన అంశంగా రైతులకు ముఖ్యం అని పంటలను ఆశించే వివిధ రకాల చీడపీడలు, తెగుళ్లను ముందుగానే గుర్తించడం, వాటి నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అవలంబించడం, అవసరానికి అనుగుణంగా మాత్రమే పురుగుమందులు వినియోగించడం, పురుగుమందుల వల్ల కలిగే నష్టాలను తగ్గించడం గురించి రైతులకు సూచించారు. అలాగే ప్రకృతి



వ్యవసాయం, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించే పద్ధతులు, నేల ఆరోగ్య పరిరక్షణ, సేంద్రియ ఎరువుల వినియోగం, పర్యావరణహిత సాగు విధానాలను రైతులకు తెలియజేయడం జరిగిందని ఉద్యాన శాఖ అధికారులు ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు ఉన్న అవకాశాలు, అనుకూలమైన భూములు, సాగు విధానం, మొక్కల సంరక్షణ, నీటి యాజమాన్యం, దీర్ఘకాలికంగా ఆదాయం పొందే విధానాలపై కూడా  వివరించారు. అలాగే పశు పోషణ గురించి వెటర్నెరీ డాక్టర్ రైతులకు తెలియజేయడం జరిగింది. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు, వారి భూముల వివరాలను నమోదు చేసుకోవాల్సిన అవసరం, భవిష్యత్తులో ప్రభుత్వ వ్యవసాయ పథకాలు మరియు రైతులకు అందే వివిధ సేవలను సులభంగా పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాధాన్యత వంటి అంశాలపై కూడా రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఆర్పీఎల్ కార్యక్రమం ద్వారా



ఇప్పటికే వ్యవసాయ రంగంలో అనుభవం ఉన్న రైతుల పూర్వ జ్ఞానం, నైపుణ్యాలను గుర్తించి, వాటిని ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేయడం ద్వారా రైతుల నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేయడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునుగోడు వ్యసాయ సహాయ సంచాలకులు బి వేణు గోపాల్, మండల వ్యవసాయ అధికారి పి. మల్లేష్ ఉద్యాన శాఖ అధికారి విద్యా సాగర్ వెటర్నరీ డాక్టర్ రమేష్ ఆత్మ డైరెక్టర్లు, ఏఈఓ నాగార్జున నెర్మట గ్రామ సర్పంచ్ తిమ్మారెడ్డి గూడెం ఉప సర్పంచ్ గుణగోని సైదులు ఇంకా ఇతర శాఖల అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వినాయకుడి శోభాయాత్ర..

# పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

## - ప్రజలతో కలిసి సందడి చేసిన ఎమ్మెల్యే.. ఘనంగా సాగిన నిమజ్జన వేడుకలు

## - ఉత్సవాలు ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయి: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ, సెప్టెంబర్ 24, (ప్రజా జ్యోతి) :**

దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలోని శివాజీ నగర్ యూత్ సభ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన వినాయకుడి శోభాయాత్ర (నిమజ్జన వేడుకలు) ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే  నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గణనాథుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు





నిర్వహించిన అనంతరం, ఆయన భక్తులు, యువతతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం, మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని, యువత ఉత్సవాల నిర్వహణలో క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని యువతకు పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణలో శివాజీ నగర్ యువత చూపుతున్న చొరవ అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.డప్పు వాయిద్యాలు, భక్తుల నినాదాల మధ్య ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ శోభాయాత్రలో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని సందడి చేయడంతో స్థానికులు, యువత ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో



కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలంపల్లి నర్సింహా, మారుపాకుల సురేష్ గౌడ్, హన్మంత్ వెంకటేష్ గౌడ్, లోకాసాని శ్రీధర్ రెడ్డి, చల్లమల్ల విజయ్, హనుమంతు సాయి చంద్ర గౌడ్, సురేష్, గౌని సత్యనారాయణ, జూలూరి రేణు గౌడ్, ఎరుకల లక్ష్మీనారాయణ, సామల రవి, జూలూరి గిరి, గడుసు మల్లేష్, ఎరుకల అశోక్ తదితరులతో పాటు శివాజీ నగర్ యూత్ సభ్యులు, గ్రామస్తులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఊరటనిచ్చిన వాన

## - పొంగిన వాగులు, వంకలు - 52.1 మి.మీ. వర్షపాతం నమోదు

## - పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం

**చింతలపాలెం, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి) :**






గత కొంతకాలంగా సరైన వర్షాలు లేక ఎదురుచూస్తున్న రైతన్నలకు గత రెండు రోజులుగా కురుస్తున్న వానలు ఊరటనిచ్చాయి. చింతలపాలెం మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన వానకు 52.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షంకు మండలంలోని చెరువులు జలకళను సంతరించుకోగా, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ సీజన్‌లో తొలిసారిగా కురిసిన భారీ వర్షాలకు వజినేపల్లి వద్ద కర్తవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దొండపాడు, మల్కాపూరం గ్రామాల పరిధిలోని వాగులు సైతం ఉప్పొంగడంతో పలు గ్రామాలకు వెళ్లే రహదారులపైకి వర్షపు నీరు చేరింది. వర్షాల ప్రభావంతో దొండపాడు వాగు వద్ద నెలకొన్న పరిస్థితిని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య, ఉపసర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాగుల ప్రవాహానికి అడ్డుగా పేరుకుపోయిన చెత్తాచెదారం, ఇతర అడ్డంకులను గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో జేసీబీలతో వెంటనే తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామకృష్ణారెడ్డి సూచించారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు ప్రయాణాలు పెట్టుకోవద్దని కోరారు. పాఠశాలలకు సెలవు ప్రకటించిన దృష్ట్యా పిల్లలు వాగులు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే తక్షణమే రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# సైబర్ నేరాలపై ఎస్బిఐ ఆధ్వర్యంలో అవగాహన

**చింతపల్లి సెప్టెంబర్ 24(ప్రజాజ్యోతి)**




చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సైబర్ నేరాలపై కళ బృందంతో ఎస్బిఐ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన కల్పించినట్లు బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధి మానవాళికి ఎంతటి మహోపకారం చేస్తుందో సాంకేతికపై సరైన అవగాహన లేకుంటే అంతే ప్రమాదంలో మానవుల్ని నెట్టేస్తుందన్నారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో పెరుగుతున్న మోసాలను అరికట్టడం కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం సైబర్ నేరాలకు వ్యక్తుల ఆర్థిక ప్రయోజనాల నుండి దేశ పునాధులకే సవాలుగా మారిందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటీపీ, ఏటీఎం పిన్, యూపీఐ పిన్, సీవీవీ నంబర్, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. అలాగే గుర్తు తెలియని లింక్‌లపై క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్‌ను స్వీకరించడం వంటి వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నకిలీ పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో వచ్చే మోసాలు, లోన్ ఆఫర్లు, ఇతర ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి, ఙఙఙ.ఛఎవతీఛతీఱఎవ.స్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ కె.శ్రీనివాస్, విచారణ అధికారి సోమా నాయక్, కుమార్, అనుదీప్, శాంత నాయక్, ప్రవీణ్ కుమార్, దీరాజ్ పాల్గొన్నారు.

## తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం.. నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గా సురిగి రమేష్ గౌడ్..

**నల్గొండ సెప్టెంబర్ 24,(ప్రజా జ్యోతి):**




గౌడ సంఘ సంక్షేమం కోసం నిరంతరం పాటుపడతానని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురికి రమేష్ గౌడ్ అన్నారు. గురువారం హైదరాబాదులోని ఫిలింనగర్ ఆఫీసులో నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన సురిగి రమేష్ గౌడ్ ను తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడి గా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు గట్టు రామచంద్రయ్య గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. నా మీద నమ్మకంతో నాకు ఈ అవకాశం ఇచ్చిన జాతీయ అధ్యక్షుడు రామచంద్రయ్య గౌడ్ కి, రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలియజేస్తూ గౌడ సంఘ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గుండాల మల్లేష్ గౌడ్ తంతనపల్లిశంకర్, పెద్ది వెంకటయ్య సురిగి సైదులు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## నీట్ పీజీ ఎంట్రన్స్ లో జాతీయ స్థాయి లో 698వ, ర్యాంక్ సాధించిన డాక్టర్ మైనం భవ్య

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 24, (ప్రజాజ్యోతి):**

జాతీయ స్థాయి నీట్ పీజీ ఎంట్రన్స్ లో మిర్యాలగూడ మండలం మైనం వారి గూడెం కు చెందిన మైనం కృష్ణయ్య, ఉమా దంపతుల కుమార్తె డాక్టర్ మైనం భవ్య 698 ర్యాంక్ సాధించింది. ఎంబిబిఎస్ పాండిచ్చేరి రాష్ట్రంలో జూలై నెలలో పూర్తి చేసింది. దేశవ్యాప్తంగా నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్ష రాసిన 2లక్షల 66 వేల మందిలో మైనం భవ్య 698 ర్యాంకు సాధించి, జాతీయస్థాయిలో నిలిచింది. పీజీలో రేడియాలజీ కోర్సు చేయనున్నట్లు డాక్టర్ భవ్య తెలిపారు. తండ్రి మైనం కృష్ణయ్య వేములపల్లి మండలంలో సైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. జాతీయ స్థాయి ర్యాంకు రావడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండు నరేందర్ గౌడ్ డాక్టర్ భవ్యను, ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జానారెడ్డి, ఎంఇఓ లక్ష్మణ్ నాయక్, నాయకులు సుదర్శన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాతాల శ్రీనివాస్ రెడ్డి, జనార్ధన్ శ్రీనివాస రావు, బ్రహ్మం, ఉపేందర్ ఉపాధ్యాయులు అనుముల శ్రీనివాస్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, శ్రీధర్, చైతన్య లత, విజయ నిర్మల, దేవేందర్ రెడ్డి, జయ, నాగమణి, కమరున్నిసా బేగం తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# గర్భిణీ తీసుకునే ఆహారం పైనే బిడ్డ ఆరోగ్యం: అనుముల ప్రాజెక్ట్ సీడీపీఓ విజయలక్ష్మి

**నిడమనూరు,సెప్టెంబర్ 24(ప్రజాజ్యోతి):**





నిడమనూరు సెక్టార్ పరిధిలో గురువారం జంగాలవారిగూడెం అంగన్వాడీలో ,ముకుందా పురం సెక్టార్ పరిధిలోని రేగులగడ్డ అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అనుముల ప్రాజెక్ట్ సీడీపీఓ విజయలక్ష్మి మన అంగన్వాడీ మన బాధ్యత పై నిర్వహించడం జరుగుతుంది .మారుతున్న జీవన శైలి లో భాగంగా మనం తినే ఆహారంలో సిరి ధాన్యలు ఉండేలా చూసుకోవాలని బయట ఫుడ్ తినడం వల్లన అనారోగ్యం బారిన పడతారు. అని పోషకాలు ఎక్కువ గల ఆహారం తీసుకోవాలి.అని పిల్లలకు మొబైల్ కు దూరం ఉంచాలి. అని మొబైల్ వాడకం తగ్గించాలని తెలియజేశారు.ఈ సందర్భంగా గర్భిణీ ,బాలింతలు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు.అదేవిధంగా గర్భిణీ తీసుకునే ఆహారం పైనే బిడ్డ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు.నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి మంచి ఆహారం తీసుకోవాలని పేర్కొన్నారు.అదేవిధంగా ఆహారంలో క్యాల్షియం, ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు.గర్భిణీలు,బాలింతలు, పిల్లలు మంచి ఆహారం తీసుకోవడం వల్ల గ్రామాలు బాగుంటా యన్నారు. పల్లెలే పట్టుకొమ్మలు కాబట్టి ఈ మార్పు పల్లెల నుండే రావాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సైదా బేగం , ఫరీదా బేగం,రేగులగడ్డ సర్పంచ్ ధనవత్ కిషోర్ ,స్కూల్ టీచర్ అంగోతు మోతి లాల్ , అంగన్వాడి టీచర్ రేణుక, అంగన్వాడీ టీచర్లు కృష్ణ వేణి నాగమణి ,ఆయా యాదమ్మ ,మణెమ్మ ,రుక్మిణి ,ప్రేమలత, జ్యోతి, నిర్మల ,పూలమ్మ ,జ్యోతి, విశాలాక్షి ,అరుణ, శైలజ ,జ్యోతి కుమారి , ఆశ కార్యకర్త నాగలక్ష్మి ,గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# జిల్లా రాజకీయాల్లో పీక్స్ కు చేరిన 'పవర్' రాజకీయం...!

## - పోటాపోటీ మీటింగులు.. ఆందోళనలు

## - బిఆర్ఎస్ కు దీటుగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ కౌంటర్

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 24,(ప్రజాజ్యోతి):**





నల్గొండ జిల్లా రాజకీయాల్లో 'పవర్' వార్ పీక్స్‌కు చేరింది. ఇంకా ఎన్నికలకు రెండేళ్ల గడువు ఉండగానే.. మిర్యాలగూడ కేంద్రంగా రాజకీయ సెగలు రూపొందుకున్నాయి... మాటకు మాట.. యాక్షన్ కు యాక్షన్ అన్నట్లుగా ఉంది అధికార కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీల వ్యవహార శైలి.

దామరచర్ల మండలం వీర్లపాలెం లోని 4,000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య పొలిటికల్ సెగలు రేగుతున్నాయి.రాష్ట్రంలో కరెంట్ కోతలకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటూ బీఆర్ఎస్ బృందంతో కలిసి ప్లాంట్‌ను పరిశీలించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విరుచుకుపడగా..అదే వేదికపై రీ-ఎంట్రీ ఇచ్చిన మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి( బిఎల్ఆర్) బిఆర్ఎస్ నేతల అవినీతి బండారాన్ని సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టి దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చారు.

**ఈ పొలిటికల్ డ్రామాపై ప్రత్యేక కథనం.**

యాదాద్రి పవర్ ప్లాంట్‌ను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయాలని చూసిన బిఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఊహించని షాక్ ఇచ్చారు!కేసీఆర్, కేటీఆర్ పిలుపుతో బిఆర్ఎస్ బృందంతో కలిసి ప్లాంట్ పరిశీలనకు వచ్చిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి.కాంగ్రెస్ పాలనలోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని,పొలాల వద్ద రైతులు, పరిశ్రమలు డీజిల్ జనరేటర్లు వాడే దుస్థితి వచ్చిందని విమర్శించారు. అంతేకాదు,ప్లాంట్‌లో టెక్నికల్ లోపాలు ఉన్నాయనడం పచ్చి అబద్ధమని,సింగరేణి జి 9 బొగ్గు సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని నివేదికలు ప్రదర్శించారు. అయితే,జగదీశ్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసీ ముగియక ముందే అదే స్పాట్‌లో రీ-ఎంట్రీ ఇచ్చిన మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ నేతల అవినీతి నిజాలను బయటపెడుతూ విరుచుకుపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారితే,ఈ యాదాద్రి పవర్ ప్లాంట్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, భాస్కరరావులు తమ సొంత ఏటీఎంలా మార్చుకుని కోట్లు నొక్కేశారని ధ్వజమెత్తారు.బొగ్గు దొరకని చోట కావాలనే 250 కిలోమీటర్ల దూరంలో ప్లాంట్ కట్టి,నాణ్యత లేని బొగ్గు ఒప్పందాలు చేసుకుని రవాణా ఛార్జీల పేరుతో ప్రజలపై ఏకంగా రూ. 40,000 కోట్ల భారాన్ని మోపారని ఎండగట్టారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్లాంట్ పేరుతో రూ. 25,000 కోట్లను దుర్వినియోగం చేసిందని, తొమ్మిదిన్నరేళ్లలో స్థానిక నిర్వాసితులకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటితో ఆగకుండా బిఆర్ఎస్ నేతల బినామీ బిజినెస్ నెట్‌వర్క్‌ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సాక్ష్యాధారాలతో సహా మీడియా ముందు ప్రదర్శించారు.'శ్రీ వెంగళమాంబ మెటల్ ఇండస్ట్రీస్'లో గతంలో కౌన్సిలర్‌గా పోటీ చేసిన వ్యక్తికి ఉన్న భాగస్వామ్యాలను,51 శాతం మేర షేర్లను బినామీల పేరిట మార్చేసిన రిజిస్ట్రేషన్ ఆధారాలను బహిర్గతం చేశారు.బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు దమ్ముంటే 2014 నుంచి 2023 ఎన్నికల నాటికి వారి ఆస్తులు ఎలా పెరిగాయో అఫిడవిట్లలోని ఆస్తుల వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచాలని సవాల్ విసిరారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 500 మంది పోలీసులతో నిర్వాసితుల ఇళ్లను ఊడబెరికి బయట పడేస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకే ఎన్జీటీ అనుమతులు తెచ్చి ప్లాంట్ 1, 2 యూనిట్ లతో పాటు 3,4 యూనిట్లు అందుబాటులోకి తెచ్చామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిర్వాసితులకు ఉద్యోగాలు,పరిహారం అందించి తీరుతామని హామీ ఇచ్చారు.విద్యుత్ కోతల పేరుతో కాంగ్రెస్‌పై దాడికి వచ్చి.తమ స్వయంకృత అవినీతి అక్రమాల్లో తామే బుక్కైన బిఆర్ఎస్ నేతలకు,ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఇచ్చిన ఈ షాకింగ్ కౌంటర్ ఇప్పుడు జిల్లా రాజకీయంలో హాట్ టాపిక్‌గా మారింది. కొద్దిరోజుల క్రితమే కేటీఆర్ నిరసన సభ సమయంలో కూడా ఎమ్మెల్యే బత్తుల గత హామీల అమలు అవినీతిపై సమాధానం చెప్పాలంటూ ప్రతిగా నిరసన చేయటం గమనార్హం.

# హోరెత్తిన గణపతి నామస్మరణ!

## - మార్కండేయ కాలనీలో అట్టహాసంగా శోభాయాత్ర

## - దేవలమ్మ నాగారం చెరువులో ఘనంగా నిమజ్జనోత్సవం

**చౌటుప్పల్, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి)**





దేవలమ్మ నాగారం లోని మార్కండేయ కాలనీలో ఎంఆర్కే (వీ=ఖ) యూత్ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ముగిశాయి. వినాయక చవితి పర్వదినం నుంచి తొమ్మిది రోజుల పాటు విశేష పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, మహా హారతులు అందుకున్న గణనాథునికి కాలనీవాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా కాలనీ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనం తరం సాయంత్రం స్వామివారి శోభాయాత్రను అత్యంత వైభవంగా ప్రారంభించారు. పూలతో సర్వాంగసుందరంగా అలంకరించిన ప్రత్యేక రథంపై కొలువుదీరిన బొజ్జ గణపయ్యను దర్శించుకునేందుకు కాలనీవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పురవీధుల గుండా సాగిన ఊరేగింపులో భక్తుల జయజయధ్వానాలు, 'గణపతి బాప్పా మోరియా' నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. డీజే భక్తిపాటల దరువులు, డప్పు వాయిద్యాల నడుమ మహిళలు, చిన్నారులు, యువకులు కోలాటాలు, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా స్వామివారి రథం వెంట అడుగులు వేశారు. భక్తులు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి, కొబ్బరికాయలు కొడుతూ, స్వామివారికి మంగళహారతులు పట్టి ఘన స్వాగతం పలికారు.కాలనీ పురవీధుల గుండా కోలాహలంగా సాగిన శోభాయాత్ర దేవలమ్మ నాగారం చెరువు వద్దకు చేరుకుంది. చెరువు ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు, సంప్రదాయ హారతులు సమర్పించారు. అనంతరం భక్తుల భక్తిపారవశ్యం, జయజయధ్వానాల మధ్య గణనాథుడిని శాస్త్రోక్తంగా చెరువులో నిమజ్జనం చేశారు. గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్కే యూత్ కమిటీ ప్రతినిధులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, పరిసర ప్రాంతాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అధికారంలో ఉన్నప్పుడు నిర్లక్ష్యం... ఇప్పుడు విమర్శలా?

## - ఆంధ్ర కాంట్రాక్టర్లను తెచ్చింది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే

## - థర్మల్ ప్లాంట్ నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే న్యాయం

## - మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పై ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ధ్వజం

**హాలియా, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లను, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలంగాణ ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని హాలియాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2గత పదేళ్ల తమ పాలనలో విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసిన జగదీశ్ రెడ్డి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అభివృద్ధికి ఏమాత్రం శ్రద్ధ తీసుకోలేదని, అప్పట్లో సరైన నిర్ణయాలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించి ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదమని శంకర్ నాయక్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ప్రత్యేక శ్రద్ధతో పర్యావరణ అనుమతులు, పబ్లిక్ హియరింగ్ వంటి పెండింగ్ ప్రక్రియలను పూర్తి చేసి, ప్లాంట్‌ను వేగంగా విద్యుత్ ఉత్పత్తిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని వివరించారు.ప్లాంట్ నిర్మాణానికి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే ఆంధ్ర కాంట్రాక్టర్లను తీసుకువచ్చిందని,ఆ తప్పులను కూడా ఇప్పుడు కాంగ్రెస్ ఖాతాలో వేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.ప్లాంట్‌కు నాణ్యమైన బొగ్గు కొరత రాకుండా సింగరేణితో పాటు మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి సరఫరా అయ్యేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు.అలాగే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాండ్ లూజర్ల కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేసిందని స్పష్టం చేశారు.భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏకలింగం లాంటి వ్యక్తులను పక్కన పెట్టుకుని జగదీశ్ రెడ్డి పవర్ ప్లాంట్ వద్ద నీతులు చెప్పడం సిగ్గుచేటని ఒక్క ఎకరం కూడా లేని వ్యక్తులు వందల ఎకరాలు ఎలా సంపాదించారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భూకబ్జాలు, అక్రమాలు బయటపడతాయనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే యత్నం చేస్తున్నారని,ప్రజలు నిజానిజాలను గమనిస్తున్నారని




ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పేర్కొన్నారు.